క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న దంపతులు

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం 5వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వేదమంత్రోచ్చరణ మధ్య అర్చకులు వందలాది మంది దంపతులతో స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీర్వచనాలు పొందారు. అనంతరం ఆలయ ఆవరణంలో భారీ అన్నసమారాధన చేశారు.

ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరం


ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న మురళి

బొండపల్లి: ప్రతిరోజు క్రమం తప్పకుండా ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడి నుంచి బయట పడవచ్చని యోగా శిక్షకులు మురళి అన్నారు. మండలంలోని గొట్లాం గ్రామంలోని షిర్డీసాయి ధ్యాన మందిరంలో శుక్రవారం యోగా, ధ్యానంపై అవగాహన కల్పించారు. ప్రతి రోజు యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించడంతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతంగా జీవనం సాగించవచ్చన్నారు. కార్యక్రమంలో పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణరాజు, తదితరులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు


కొత్తవలస జంక్షన్ వద్ద శిలువయాత్ర

కొత్తవలస: గుడ్‌ఫ్రైడేని పురస్కరించుకుని మండలంలోని క్రైస్తవులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తును శిలువ వేసిన ఉదంతాన్ని గుర్తుచేసుకున్నారు. ఈస్టర్ ఆదివారం ముందు వచ్చే శుక్రవారం గుడ్‌ఫ్రైడేగా జరుపుకోవడం ఆనవాయితీ. ఈ మూడు రోజుల పాటు క్రీస్తు విశ్వాసకులు ప్రత్యేక ప్రార్థనలు, ఉపవాస దీక్షలు చేస్తారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: మండలంలో నీలకంఠరాజపురం, నలబిల్లి పంచాయతీలో ఖాళీగా ఉన్న రెండు వలంటీర్ పోస్టల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ పట్నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నీలకంఠరాజపురంలో ఎస్టీ(పురుషుడు), నలబిల్లిలో మహిళ (జనరల్)లకు కేటాయించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 12వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 13న దరఖాస్తుల పరిశీలన, 15న ఇంటర్వ్యూలు, అదేరోజు నియామక పత్రాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పాతబగ్గాంలో 'గడపగడపకు'

గజపతినగరం/రూరల్: మండలంలోని పాత బగ్గాం సచివాలయం పరిధి భూదేవిపేట గ్రామంలో శనివారం సాయంత్రం 4 గంటలకు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సుదర్శన్ తెలిపారు. అలాగే ఆదివారం ఉదయం బంగారమ్మపేటలో, సోమవారం పాతబగ్గాంలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

గొట్టుపల్లిలో..

మెరకముడిదాం: మండలంలోని గొట్టుపల్లి గ్రామంలో నేడు 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. అన్ని శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పైపులైన్ మరమ్మతులు

వేపాడ: దబ్బిరాజుపేట గ్రామంలో తాగునీటి పైపులైన్ మరమ్మతులను శుక్రవారం చేపట్టారు. సర్పంచ్ దండు ముత్యాలమ్మ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. గ్రామదేవత పండుగ, వేసవి నేపథ్యంలో గ్రామస్తులు తాగునీటి కోసం ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పైపులైన్లు బాగుచేయించినట్లు చెప్పారు.

ప్రైవేటీకరణ తగదు

విజయనగరం పూల్‌బాగ్: విద్యారంగాన్ని ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయాలనుకోవడం తగదని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు అన్నారు. యూటీఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం స్థానిక ఎన్‌పీఆర్ భవనంలో శుక్రవారం నిర్వహించారు. యూనియన్ నాయకులు జె. రమేష్, ఈశ్వరరావు, సత్యశ్రీనివాస్, ప్రసన్నకుమార్, భాస్క రరావు, ప్రసాదరావు, రాజారావు పాల్గొన్నారు.

పండగలా 'జగనన్నే మా భవిష్యత్'

వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం పిలుపుమేరకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి జగన్ సర్కారు చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని వివరించారు. ఇంటి యజమానుల అనుమతి మేరకు సీఎం జగన్ స్టిక్కర్లు గోడలకు అతికించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతుగా ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్ల నుంచి మిస్డ్‌కాల్స్ ఇచ్చారు. జగనన్నతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, మళ్లీ ఆయనే సీఎం కావాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.


గుర్ల: పాలవలసలో ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ ప్రమీల


గంట్యాడ: రామవరంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి


వేపాడ: బానాదిలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో పాల్గొన్న కర్రి యశోద


చీపురుపల్లి: పిల్లపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుల ఇంటింటి ప్రచారం

గంట్యాడ: మండలంలోని రామవరం గ్రామంలో శుక్రవారం 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని ఎంపీపీ పీరుబండి హైమావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కష్టపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, సర్పంచ్ పీరుబండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

☛ **గుర్ల:** మండలంలోని పాలవలస, కెల్ల, గుర్ల, భూపాలపురం, జమ్ము, లవిడాం గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.సూర్యనారాయణరాజు ప్రారంభించారు. మండలంలోని 42 పంచాయతీల్లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు జరిగిన మంచిని వివరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, బోళ్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

☛ **చీపురుపల్లి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలోనే పేద ప్రజలకు భవిష్యత్ ఉంటుందని జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని పిల్లపేట, విజయకాలనీలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగళగిరి సుధారాణి, నాయకులు పతివాడ రాజారావు, అప్పికొండ ఆదిబాబు, ఇప్పిలి గోవింద, పీతల మురళి తదితరులు పాల్గొన్నారు.

☛ **చీపురుపల్లి రూరల్(గరివిడి):** మండలంలోని శేరీపేట పంచాయతీలో ఎంపీటీసీ నేతేటి కృష్ణవేణి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి గత ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తేడాలను వివరించారు. ప్రజల అనుమతితో నవరత్నాల స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పిల్లా ఆదినారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

☛ **మెరకముడిదాం:** 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఊటపల్లి, సోమలింగాపురం, గొట్టుపల్లి, భైరీపురం, భీమవరం, తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.

☛ **దత్తిరాజేరు:** సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి చేస్తున్న మంచిని ప్రజలకు వివరించడమే 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం ఉద్దేశమని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అన్నారు. వింధ్యావాసిలో సర్పంచ్ చంద్రోఖర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించి, వారి అభిప్రాయాలను సేకరించారు. పార్టీ మండల అధ్యక్షుడు కడుబండి రమేష్‌నాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, చుక్క మురళి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

☛ **బొండపల్లి:** మండలంలోని అన్ని గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. బి.రాజేరు గ్రామంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు, పార్టీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, దేవుపల్లి గ్రామంలో జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, గొల్లుపాలెం గ్రామంలో జేసీఎస్ కన్వీనర్ పల్లి రఘు, గొట్లాం గ్రామంలో వైస్ ఎంపీపీ మీసాల సరోజిని, పీఏసీఎస్ చైర్మన్ మహంతి రమణ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాలను వివరించారు.

☛ **గజపతినగరం రూరల్:** మండలంలోని 30 పంచాయతీల్లో శుక్రవారం గృహసారథులు, వలంటీర్ల ఆధ్వర్యంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టారు. స్థానిక కార్యకర్తలు, నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు జగనన్న ఫొటోలతో కూడిన స్టిక్కర్లను ఇంటి గోడలకు అంటించారు.

☛ **వేపాడ:** మండలంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా మొబైల్ నుంచి మిస్డ్ కాల్ ఇవ్వడంతో పాటు ఇంటి గోడలపై జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలను అంటించారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి..


సీఎం జగన్ ఫొటోతో ఉన్న స్టిక్కర్‌ను ఇంటి తలుపుపై అతికిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట, మామిడిబంద కాలనీ, గజపతినగరంలో శుక్రవారం నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పాల్గొన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా.. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో చెప్పడంతో ఆయన ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వారి అనుమతితో జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోలో ఉన్న స్టిక్కర్లను ఇంటి గోడలపై, తలుపుపై అతికించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటరావు, జెడ్పీటీసీ గార తవుడు, ఎంపీటీసీలు మండల సూర్యకళ, రేగలత, సర్పంచ్‌లు నరవ కొండమ్మ, కొంత్యాన విజయలక్ష్మి, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నకు మద్దతుగా..


కొత్తవలస: దేశపాత్రునిపాలెంలో ఓ ఇంటికి జగనన్న స్టిక్కర్‌ను అతికిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఇంటి యజమాని అనుమతితో తలుపులు, గోడలపై సీఎం జగన్ ఫొటోతో ఉన్న స్టిక్కర్లను అతికించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో ఈ నెల 20 వరకు సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ బొంతల వెంకటరావు, పార్టీ నాయకులు బొడ్డు అప్పారావు, కొరుబిల్లి స్వామినాయుడు, డి.అప్పన్న, ఏడువాక నారాయణ తదితరులు పాల్గొన్నారు.


మెరకముడిదాం: ఊటపల్లిలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని వివరిస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి


చీపురుపల్లి రూరల్: శేరీపేటలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని చేపడుతున్న నాయకులు


దత్తిరాజేరు: చౌదంతివలసలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, సర్పంచ్ శ్రీదేవి, తదితరులు


బొండపల్లి: బి.రాజేరులో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీపీ చల్లా చలంనాయుడు


గజపతినగరం రూరల్: పాతబగ్గాంలో ప్రచారం చేస్తున్న గృహసారథులు

ఆరోగ్యంగా ఉంటేనే ఆనందం


గజపతినగరం: ఆరోగ్య దినోత్సవ వేడుకల్లో ఆస్పత్రి సిబ్బంది


కె.కొత్తవలస ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


కొత్తవలస: వియ్యంపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గజపతినగరం: ఆరోగ్యంగా ఉంటేనే ఆనందంగా జీవించగలమని స్థానిక ఏరియా ఆస్పత్రి డాక్టర్ వినీత్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు పాటించాల్సిన సూత్రాలను రోగులకు వివరించారు. మంచి ఆహార అలవాట్లు, వ్యాయామం, ధ్యానం చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హెడ్ నర్స్ సుజాత, స్టాఫ్ నర్స్‌లు లక్ష్మి, సంధ్య, షెరీన, శాంతి, ల్యాబ్ టెక్నీషియన్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మంచి ఆహార అలవాట్లతో ఆరోగ్యం పదిలం

దత్తిరాజేరు: మంచి ఆహార అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కె.కొత్తవలస వైద్యాధికారి సంతోషిరూప అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కొత్తవలస గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆకుకూరలు, కూరగాయలు, పప్పుదినుసులను ఆహారంగా తీసుకోవడం, శరీరానికి కావాల్సిన పరిమాణంలో నీరు తాగడం, యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ రోగ్యవంతంగా జీవనం సాగించవచ్చన్నారు.

వియ్యంపేటలో..

కొత్తవలస: మండలంలోని వియ్యంపేటలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఇ.గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. అందరికీ ఆరోగ్యం, ఆరోగ్యమే మహాభాగ్యం, అందరి ఆరోగ్యం–అందరి బాధ్యత అంటూ నినాదాలు చేశారు. అనంతరం హెల్త్ సహాయకుడు సత్యారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మద్యపానం, ధూమపానం, వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ గోవిందరాజు, పీహెచ్ఎన్ జగదాంబ, హెచ్‌వీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

నేడు 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు

మెరకముడిదాం: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు 'వైఎస్సార్ ఆసరా' మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని పేర్కొన్నారు. మండల పరిధిలోని డ్వాక్రా సంఘాల సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

సచివాలయం, ఆర్‌బీకే ప్రారంభం రేపు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలం తోండ్రంగి గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రాలను ఈ నెల 9న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రితో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జగనన్నే రాష్ట్ర భవిష్యత్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: జగనన్నే రాష్ట్ర భవిష్యత్ అని తెలియజేస్తూ..రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 20వ తేదీ వరకు 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్.కోట పట్టణంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో శుక్రవారం విలేకరులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 7లక్షల మంది పార్టీ సైనికులు 14 రోజుల్లో సుమారు 1.6 కోట్ల కుటుంబాల్లోని 5కోట్ల మంది ప్రజలను కలిసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తారన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు గడపగడపకూ వెళ్లి టీడీపీ పాలనకు వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న తేడాను ప్రజలు తెలియజేయడంతో పాటు ప్రభుత్వ పనితీరు మెరుగుపర్చుకునేందుకు ప్రజల అభిప్రాయాలను సేకరిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ 8296082960 నంబర్‌కు మిస్‌కాల్ ఇవ్వడం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతు తెలియజేయాలని కోరారు. అనంతరం ఐదు మండలాల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు, మాజీ ఎమ్మెల్యే హైమావతి, డీసీసీబీ చైర్మన్ చినరామునాయుడు, జీసీసీ చైర్మన్ శోభా స్వాతిరాణి, ఏఎంసీ చైర్మన్ ఎం.కస్తూరి, జెడ్పీటీసీలు ఎస్.అప్పారావు, ఎం.వెంకటలక్ష్మి, టి.వరలక్ష్మి, ఎంపీపీలు జి.శ్రీనివాసరావు, ఎస్.గోపమ్మ, డి.సత్యవంతుడు, ఎస్.అరుణ, వైస్ ఎంపీపీలు పి.వెంకటరమణ, పార్టీ మండల అధ్యక్షులు జి.రవికుమార్, ఎం.జగన్నాథం, మోపాడ కుమార్, ఒబ్బిన నాయుడ, జి.సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు బి.వెంకటరావు, ఎస్.చంద్రినాయుడు, బి.శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా నవధాన్యాల కిట్లు


విత్తనాలను ప్యాంకింగ్ చేస్తున్న సబల సంస్థ ప్రతినిధులు

కొత్తవలస: చీడివలస క్లస్టర్ పరిధిలోని 13 గ్రామైక్య సంఘాల్లో 2,198 మంది రైతులకు ఉచితంగా నవధాన్యాల కిట్లు పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నట్లు సబల సంస్థ కోఆర్డినేటర్ గోవిందరావు తెలిపారు. తుమ్మికాపల్లి గ్రామంలో శుక్రవారం విత్తన ప్యాకెట్లను సిద్ధం చేశారు. మండలంలో ప్రస్తుత ఏడాదికి 2291 ఎకరాల్లో నవధాన్యాలు సాగు చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. స్థానిక రైతుల నుంచి వివిధ రకాల విత్తనాలను సేకరించినట్లు చెప్పారు. ఎకరాకు 10 నుంచి 13 కేజీలు చొప్పున 30 రకాల విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. త్వరలోనే రైతులకు విత్తన కిట్లు ఉచితంగా అందజేస్తామన్నారు.

కనులపండువగా శ్రీనివాసుని కల్యాణం


దేవేరులతో శ్రీనివాసుడు

విజయనగరం టౌన్: పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయ 13వ వార్షికోత్సవాలను పురస్కరించుకుని స్వామి కల్యాణాన్ని శుక్రవారం సాయంత్రం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నారాయణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేదపండితుడు పీవీ. నరసింహాచార్యుల సమక్షంలో స్వామివారికి వేకువజాము నుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం అగ్ని ఆరాధన, సుదర్శన హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని , స్వామివారిని దర్శించి తరించారు.

సీఎం జగన్ చెప్పాడంటే.. చేస్తాడంతే..

- 95 శాతానికి పైగా ఎన్నికల హామీలు అమలు
- నాలుగేళ్లుగా రాష్ట్రంలో సంక్షేమ పాలన
- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: జగనన్నే మా భవిష్యత్ (మా నమ్మకం నువ్వే జగనన్న) కార్యక్రమంలో పార్టీ శ్రేణులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పిలుపునిచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట ఇచ్చారంటే తప్పకుండా నెరవేర్చుతారని అన్నారు. ఇప్పటికే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 95 శాతానికి పైగా అమలు చేసి చూపారని గుర్తుచేశారు. ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు జగనన్న సైన్యం నియోజకవర్గంలోని కోటి 60 లక్షల కుటుంబాలను కలిసి ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరించనుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి చేస్తుంటే.. ప్రతిపక్షాలు పచ్చమీడియా ద్వారా ప్రజలకు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని, వాస్తవాలను ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. ప్రజలు గత ప్రభుత్వానికి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను గుర్తించాలని కోరారు. సంక్షేమ పాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతివ్వాలని, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, జేసీ కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం, సీనియర్ నేతలు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, సోషల్ మీడియా కన్వీనర్ పి.నారాయణమూర్తి, కె.రాముునాయుడు తదితరులు పాల్గొన్నారు.